★ వెలుగు నీడలు. ★

శ్రీమతి జయంతి కామేశ్వరి.

రైలు హరిద్వారం విడిచిపెట్టింది. ఇంకా స్పీడు అందుకోలేదు. భానుమూర్తి కిటికీలోంచి బయటకు తొంగి చూస్తున్నాడు. రైలుదారిప్రక్కనున్న భూమి, తెలుపు నలుపు, తెలుపు నలుపుగా వెనక్కి పరుగెత్తుతోంది. ఆ రైలుపెట్టెలో మాత్రం జనం ఇసకవేస్తే రాలకుండావున్నారు. గుమ్మందగ్గర పెట్టెలూ, బెడ్డింగులూ, మూటలూ ఇంకా ఏవేవో ఎవరివో పోల్చుకోలేని స్థితిలో పేర్చబడివున్నాయి. వాటి సందుల్లోనే కాళ్లిరికించి కూర్చున్నవాళ్లూ, కూర్చున్న వాళ్ల బుజాల నానుకుని నిలుచున్నవాళ్లూను. ఏదో డెహ్రాడూనులో గంటన్నర ముందొచ్చి పైబెర్తుమీద పక్క పరుచుకోబట్టిగాని లేకుంటే తనకీ అదేగతి పట్టును. ఏది ఏమైనా నిలబెట్టో కూర్చోబెట్టో ప్రతీవాళ్లూ తమ తమ శరీరాల్ని గమ్యస్థానం చేర్చుకోవాలి గదా! కోటిమందికీ కోటి పనులు. అందులో తనదొకటి. భానుమూర్తి మెల్లగా జోళ్లు విప్పుకుని పై బెర్తుమీది కెగిరేడు. అతడు విడచిన సీటులో అమాంతంగా యిద్దరు కూలబడ్డారు. భానుమూర్తి పైన వెల్లకిలా పడుకుని టైముచూసేడు. ఇంకా తొమ్మిదే. ఎప్పుడు తెల్లారుతుంది, ఎప్పుడు ఢిల్లీవస్తుందని అతనిలో ఒకటే తహతహ. సూక్ష్మంగా చెప్పాలంటే అతని మనస్సు అంతకుముందే ఢిల్లీస్టేషను చేరుకుని శరీరాని కెదురు చూస్తోంది. భానుమూర్తి న్యూసుపేపరు తీసి మొహానికి అడ్డంగా పెట్టుకుని కళ్లు మూసేడు. రైలు స్పీడు అందుకుని ఇటూ అటూ వూగుతూ పోతూంది. భానుమూర్తికి నిద్రపట్టలేదుగాని, ఆవూపులో, ఆజోరులో కాస్త శరీరం మత్తెక్కి మగతకన్ను పడ్డమాట మాత్రం వాస్తవం.

భానుమూర్తి డెహ్రాడూనులో ఉద్యోగం చేసుకుంటున్నాడు. నెలకీ రెండువందల జీతం. దానిలో వంద రూపాయలతో తాను గడుపుకొని మిగతాది కోనసీమలో వున్న తన భార్యకి పంపిస్తుంటాడు. ఈమధ్యదాకా ఆమె కూడ డెహ్రాడూనులోనే వుండిగాని, ఆరునెలలక్రితం చెల్లెలి పెళ్లికి పుట్టింటికి వెళ్లి ఇంకా అక్కడే వుంటూంది. భానుమూర్తి ఆంధ్రదేశాన్ని విడిచి సుమారు మూడేళ్లయింది. ఇంతలో అక్కడ ఎన్నో ముఖ్యవిషయాలు గడిచిపోయాయి. అన్నిటికంటే ముఖ్యం అతని మరదలు జానకి పెళ్లి. ఒకనాడు తనతో ఆడుతూ పాడుతూ చిలిపిచేష్టలు చేసే జానకి పెద్దదై ఈనాడు అత్తింటికి వెళ్లిపోయింది. ఆమె అత్తవారు లక్షాధికారులట. ఢిల్లీలోనే వాళ్లకి మూడు మేడలున్నాయట. ఆఖరికి జానకి పెళ్లికికూడా తాను కోనసీమకి వెళ్ళలేకపోయాడు. తానూ నొచ్చుకున్నాడు. కాని ఏం లాభం? ఆఫీసువాళ్లకి చీమకుట్టలేదు. సారు శలవియ్యలేదు. కనుక ఎల్లాగో భార్యనిమాత్రం పంపించి వూరుకున్నాడు పెళ్లికి. ఆతర్వాత జానకి అత్తారింటికి ఢిల్లీ వచ్చిందంటే సంతోషించి ఈనాటికి మూడురోజులు శలవు వస్తే ఆమెను చూడాలని బయలుదేరేడు భానుమూర్తి. ఈపాటికి తనవుత్తరం వాళ్లకి చేరివుంటుంది. ఉదయం భార్యాసమేతుడై తోడల్లుడు స్టేషనుకు వస్తాడు. జానకి తాను గుర్తుపట్టలేనంతగా మారిపోయి వుంటుంది. రత్నాల హారం, రేడియోగాజులూ, వజ్రాల ముక్కుపుడక, నీలాల కమ్మలూ ఇవన్నీ పెళ్లిలోనే పెట్టేరట జానకికి. ఈ లిష్టంతా తన భార్య రాసిపంపింది. ఇందులో వొక్కటైనా తన భార్యకి పెట్టలేక పోయానుగదా అని బాధపడ్డాడు భానుమూర్తి. అయితేనేం జానకి పెట్టుకుంటేమట్టుకు తనకి సంతోషంకాదూ!! ఒకవేళ జానకి తన అత్తవారి సౌభాగ్యంలో వెయ్యోవంతు చెయ్యని తనను చూసి పరిహసించదు గదా? పాపం ఆమె అల్లాంటిదికాదు. తాను చిన్ననాటి నుంచీ ఆమె నెరుగును. తన పెళ్లిఅయిన క్రొత్తలో తన భార్యతోబాటు ఆమెకీ పకోడీల పొట్లాలు తెచ్చి యిస్తుండేవాడు. వేయించిన వేరుశనగకాయలు ముందుపోసుకుని ముగ్గురు గోదావరిగట్టున వెన్నెలరాత్రుల్లో కథలు చెప్పుకొనేవారు. ఇప్పుడనకూడదుగాని ఒకనాడు తన స్నేహితుడు "నువ్వు పెళ్లాడినది పెద్దామెనా చిన్నామెనా" అని అడిగేడు జానకి యెదుట. తాను నవ్వుతూ. "ఇద్దర్నీ అనుకో" అన్నాడు. అది విని జానకి "ఫో బావా" అంటూ వాలు జడతో చెళ్లున కొట్టింది.

కాకులు కూస్తున్నాయి. భానుమూర్తి లేచి, బెడ్డుచుట్టేసి క్రిందికి దిగేడు. చీకటి గుహని చీల్చుకుని రైలు వెలు

తురుకేసి పరుగెడుతోంది. ఆ పెట్టెలో చాలాభాగం ఖాళీ అయిపోయింది. రాత్రి కనుపించిన మొహాలు చాలావరకు దారిలో దిగిపోయాయి. ఇప్పటికే వాళ్లల్లో చాలామంది తమ బంధువులనూ, భార్యలనూ, మరదళ్లనూ కలుసుకుని వుంటారు. భానుమూర్తి మనస్సు ఆందోళన చెందుతోంది. 'జానకిని ఎల్లాగ కలుసుకోవడం, ముందేమి మాట్లాడడమా' అని ఆలోచిస్తున్నాడు. రైలు యమునా నది దాటింది. దూరప్రయాణంచేసి అలసిపోయి కాళ్లీడ్చుకుంటూన్న ప్రయాణీకునిలాగ వేగం తగ్గి ప్రాకుతోంది. ఒక్కసారి కూతకూసింది. భానుమూర్తి బయటకు తొంగి చూసేడు. ఢిల్లీ స్టేషను వచ్చేసింది. ప్లాటుఫారంమీద జనసమూహంలో జానకిని పోల్చుకోలేకపోయాడు. "ఉస్ అమ్మయ్యా" అంటూ ఆగింది రైలు. సముద్ర కెరటాల్లా విరుచుకుపడ్డారు జనం రైలుమీద. భానుమూర్తి ఒక మనిషిని పిలిచి సామాను దింపుకున్నాడు. ప్లాటుఫారంమీద ఎంత కలియజూసినా జానకి జాడ కనబడలేదు. జనం చాలాభాగం వెళ్లిపోతున్నారు. ఇంతలో తెల్లకోటూ తెల్ల పంట్లామూ తొడుక్కున్న మనిషి వొకడు భానుమూర్తిని ఎగాదిగా చూసి "మీదేవూరు" అన్నాడు వచ్చీరాని తెలుగులో. "ఏం? మీదేవూరు" అన్నాడు భాను.

"మాదీవూరే. మేమొకరికోసం చూస్తున్నాం. ఆయన పేరు మరచిపోయాను. ఆయన డెహ్రాడూనునుంచి రావాలి" అన్నాడతడు.

"ఏం చిదానందంగారి మనిషివా నువ్వు" అన్నాడు భాను.

"అవును. చిన్నమ్మగారి బావగారు మీరేనా?"

భానుమూర్తి మొహం వికసించి తలవూపేడు "ఔ"నని.

"రండి. బయట కారుంది. నేను వాళ్ల డ్రైవరుని" అంటూ దారి చూపేడతడు.

చక్కని బ్యూకు కారులో మెత్తగా సాగిపోతున్నాడు భానుమూర్తి. దారిలో "అయితే, మీ అయ్యగారూ, అమ్మగారూ రాలేదేం స్టేషనుకి" అన్నాడు భాను.

"వా రెప్పుడూ బయటికి రారండి". డ్రైవరు...... ఇక భానుమూర్తి మాట్లాడలేదు. అతని మెదడునిండా ఆలోచనలూ, గొంతునిండా మాటలూ క్రిక్కిరిసివున్నాయి. అరగంట కాకముందే ఆకారు ఒక మూడంతస్థుల మేడ ముందు ఆగింది. లోనుంచి ఇద్దరు మనుష్యులు వచ్చి సామాను దింపేరు. భానుమూర్తి లోపల అడుగుపెట్టగానే సిలుకులాల్చీ తెల్లని మల్లుపంచతో ఒక యువకుడెదురుగా వచ్చేడు. భానుమూర్తి నమస్కారంచేసి "తమరేనా చిదానందంగారు" అన్నాడు. "నేనుకాదు మాతమ్ముడు. అలా కూర్చోండి" అంటూ ఆయన సోఫాలో కూలబడ్డాడు. భానుమూర్తికూడా కూర్చుని "చాలా సంతోషం ఇప్పటికైనా మీ అందరినీ చూడగలిగేను. ఎంత ప్రయత్నించినా పెళ్లికి రాలేకపోయాను" అన్నాడు. ఆ మాటలు మార్చేసి ఆయన "ఏమిటి డెహ్రాడూను విశేషాలు. ఇప్పుడు మీకు జీతమెంత?" అన్నాడు. భానుమూర్తి కాప్రశ్న నచ్చలేదు. ఎదుటివాని రాబడి నడిగేవానికంటే పశువుయ్యుండబోడని అతని అభిప్రాయం. అయినా మన అభిప్రాయాలు ఎల్లవేళలా వెలిబుచ్చడం అసంభవం గనక తన కోపాన్ని దిగమ్రింగుకుని "రెండువందలు" అన్నాడు. "పాపం, మీకావూళ్లో ఏం చాలుతాయి" అని చప్పరించాడాయన. భానుమూర్తి ఒక చిన్న నవ్వుమాత్రం పారేసేడు. ఇంతలో కాఫీ వచ్చింది. ఇద్దరూ పుచ్చుకున్నారు.

"పైకివెళ్లి స్నానం చెయ్యండి" అన్నాడాయన. ఒక మనిషి భానుమూర్తిని రెండో అంతస్థులోవున్న ఒక గదిలోకి తీసుకువెళ్లేడు. ఆ గది చాలా పెద్దది. ఓమూల ఇనుప మంచం, కుర్చీలూ టేబిలూ వున్నాయి. దానిని ఆనుకునే స్నానాలగది వుంది. భానుమూర్తి మెల్లగా దాన్లో ప్రవేశించి స్నానంచేసి బట్టలు మార్చుకుని కూర్చున్నాడు. వెంటనే వెళ్లి జానకిని కలుసుకోవాలని అతని మనస్సు ఆందోళన పడుతోంది. కాని పరిచయంలేని ఆయింట్లో స్వతంత్రంగా ఎల్లామసలడం? ఇంతలో ఇందాకటి ఆయనే వచ్చి "ఏం బాగుందా మీకిక్కడ?" అన్నాడు.

"బాగానేవుంది. మాతమ్ముడెక్కడ?" అన్నాడు భాను.

"అల్లాగ వీధిలోకి వెళ్ళేడు. మీమరదలు పైనివుంది రండి" అంటూ పైకి తీసుకు వెళ్ళేడు. జానికి బావని చూసి తన బావగారుండడం వల్ల కాస్త సిగ్గుపడింది.

"ఏం బాగున్నావా జానకీ" అన్నాడు బావ.

"బాగానే వున్నాను, నీదయవల్ల" అంది జానకి. అనడమంటే అల్లాగ అంది కాని ఆమెవాలకం చూస్తే ఏమీ బాగున్నట్లులేదు.

తానూహించినటు ముసి ముసి నవ్వులతో ఎదురు రాలేదు. పల్లెటూళ్లో ఎల్లాగ వుండేదో అల్లాగేవుంది గాని తన భార్య రాసిన నగలు గాని, చీని చీనాంబరాలుగాని ఏవీ ధరించలేదు.

"జానకీ ! పట్నం దాని వైపోయావు. ఏమిటి ఢిల్లీ విశేషాలు" అన్నాడు భానుమూర్తి.

ఆమె మౌనంగా వెర్రిగా నవ్వి "అక్కా వాళ్ళూ బాగున్నారా" అంది.

"బాగానే వున్నారు." అన్నాడు భానుమూర్తి.

"లేవండి భోంచేద్దాం" అన్నాడు చిదానందం అన్న.

"మా తమ్ముడు గారిని రానివ్వండి ఏకంగా కూర్చుందాం"

"వాడు సాయంత్రం గాని రాడు. పనుండి వెళ్ళేడు"

ఇద్దరూ భోజనానికి కూర్చున్నారు. వంట మనిషి శాక పాకాలు చక్కగా చేసింది. భోంచేస్తూన్నంతసేపూ ఆయన తన వ్యాపారం గురించి దంచేస్తున్నాడు. తల్లి దండ్రులు కాశీ యాత్రకు వెళ్ళేరట- ఒక తమ్ముడు కలకత్తాలో చదువుతున్నాడుట- వాణ్ణి లండన్ పంపించే ఆలోచనలు కూడా వున్నాయట- మిగతా తమ్ములిద్దరూ అంటే చిదానందం మినహా యిక్కడే చదువుకొంటున్నారట. భానుమూర్తి ఊ కొట్టి వింటున్నాడేగాని దేనికీ ఎదురు ప్రశ్నించలేదు.

భోజనానంతరం భానుమూర్తి తన గదిలోకి వచ్చి కాస్త విశ్రమించేడు. జానకి వద్దకి వెళ్ళి ఏదైనా బాతాఖానీ కొడదామనుకున్నాడు గాని ఆమె ఆడవాళ్ళతో కలిసి భోజనానికి కూర్చుంది. తర్వాత తానే వస్తుందేమో నని ఎదురు చూసేడు కాని ఇంతలో కునుకు పట్టింది. సాయంత్రం నాలుగింటికి ఎవరో లేపుతే లేచేడు. ఎదుట బల్లమీద మైసూరుపాకం, పకోడీలు, వెచ్చవెచ్చని తేనీరు పెట్టి ఓ మనిషి వెళ్ళిపోతున్నాడు. అతన్ని అడిగేడు భానుమూర్తి. చిదానందం వచ్చిపైన వున్నాడని తెలిసింది. తానే వెళ్ళి కలుసుకుందామనుకున్నాడుగాని, ఇంతలో ఇందాకటాయన వచ్చి షికారు వెడదాం రమ్మన్నాడు. "చిదానందాన్ని కూడా తీసుకు వెడదా" మన్నాడు భానుమూర్తి. "వాడిప్పుడు రాడు, పైన భార్యా వాడూ వున్నారు" అన్నాడాయన. "పోనీ వాళ్ళిద్దర్నీ రమ్మనండి" అందామనుకున్నాడుగాని ధైర్యం చాలలేదు.

రాత్రి భోజనాలదగ్గర కూర్చునేదాకా చిదానందం మొహం కనపడలేదు భానుమూర్తికి. చిదానందానికీ తనకీ మధ్యగా అన్నగారు కూర్చున్నారు. చిదానందం తెల్లగా బాగున్నాడు మనిషి. అందంలో జానకికి తగిన ఉజ్జీయే. అయితే నేం ఏమంత మాటకారి గాదు.

"మా జానకి మీమాట సరిగా వింటోందా?" అన్నాడు భాను. వంటగది వైపునుంచి తొంగిచూస్తున్న జానకివైపు చూసి. చిదానందం చిన్నగా నవ్వాడు.

"మీరేం చదువుకున్నారు" అన్నాడు భాను. జవాబు లేదు. పెద్దన్న జవాబు చెప్పేడు.

"చదువాబ్బేలేదు వీడికి. మా వర్తకంలో పెడదామని యోచన."

ఈమాటైనా చిదానందం తనతో మాట్లాడలేదని కొంచెం బాధపడ్డాడు భానుమూర్తి. ఎలాగైనా మాట్లాడించాలని "మీరెప్పుడైనా డెహ్రాడూను వచ్చేరా" అన్నాడు తోడల్లుని మొహంలోకి తొంగిచూసి. అతడు మెల్లగా మౌనంగా నవ్వేడు. "అక్కడ మాకేంపని" అన్నాడు అన్నయ్యే. చిదానందం మౌనం వహించడం భానుమూర్తికి అర్థం కాలేదు. అదేమి గర్వం కాదుగద? భోజనాలై కుళాయిదగ్గర చేతులు కడుక్కుంటున్నసమయంలో భానుమూర్తి చిదానందాన్ని మళ్ళీ పలకరించేడు.

"మామగారి దగ్గరనుంచి ఉత్తరాలు వస్తున్నాయా?" చిదానందం మాట్లాడలేదుగాని అతని చిన్నతమ్ముడు పన్నెండేళ్ళవాడు ఇలాగన్నాడు "వాడికి మాటలు రావు." భానుమూర్తి నిర్ఘాంతపోయాడు. ఆమేడ మూడంతస్థులతోబాటు తల్లక్రిందులయిపోతే బాగుండుననిపించింది.

ఆరాత్రి భానుమూర్తికి నిద్రపట్టలేదు. ఆగదిలో తానొక్కడేగాని తన మనస్సులో వేలాది ప్రజలు. వీళ్ళందరూ జానకి బ్రతుకు భగ్నం చేసేరు. మూగి మొగుడుతో కాలం గడుపుకోమని శాసించేరు. ఆమె మొహంలో ఉత్సాహం ఎందుకు కనపడలేదో ఇప్పుడర్థమయిందతనికి. ఏడ్చి ఏడ్చి గుండెని రాయిగా చేసుకుని బ్రతుకుతోంది జానకి. అల్లునికి తిండివుండడ మొక్కటే ప్రధానమనుకున్న మామగారు రాక్షసుడనుకున్నాడు. అసలు విషయం తనకెన్నడూ

రాయనందుకు భార్యమీదకూడా కోపం కలిగింది భానుమూర్తికి. ఇంకా ఆలోచించేడు. పోనీ జానకిని ఆ యింట్లోంచి తీసుకుపోతే! తిరిగి ఎవరికైనా యిచ్చి పెళ్ళిచేస్తే: ఎవరు చేసుకుంటారు. పోనీ తానే చేసుకుంటే? వాళ్ళ ధనం, కారు, ప్రజలు, పోలీసులు జ్ఞాపకం వచ్చేరు భానుమూర్తికి. అతని కళ్ళల్లోంచి నీరు స్రవిస్తోంది. తన జీవితమంతా త్యాగం చేసైనా ఆమెకి సాయం చెయ్యాలనుకున్నాడు.

మర్నాడు భానుమూర్తి లేచీలేవగానే చిదానందం గదిలోకి వచ్చేడు. పాపం, ఏవేవో సౌజ్ఞలతో తెలియజేసేడు. టిఫినుకి పైకిరమ్మని తీసుకువెళ్ళేడు. అక్కడ భానుమూర్తి, చిదానందం, జానకి ముగ్గురూ కలిసి తిన్నారు. ఆతర్వాత తాను పెట్టిన నగలూ, బట్టలూ చూపమన్నాడు భార్యని. జానకి భర్త ఆజ్ఞను పాలించింది. భానుమూర్తి వాటిని చూస్తున్నాడేగాని అవన్నీ అతని దృష్టిలో నిర్జీవంగా వెలవెల బాయుతున్నాయి. అయినా వాళ్ళకి సంతృప్తి కలిగించాలని బాగున్నాయంటున్నాడు. ఇంతలో దేనికో చిదానందం క్రిందికి వెళ్ళిన సమయంచూసి "జానకీ, మీకు మీనాన్న తీరని అపచారం చేసేడు" అన్నాడు. "ఊరుకో బావా ఎవరేనా వింటారు. ఇదంతా ఘటన ఎవరేంజెస్తారు?" అంది ఆమె.

"నిన్నుచూస్తే నాకేదో బెంగగావుంది. ఆరు నెలలలో ఆరవై ఏళ్ళదానిలా అయిపోయావు.'' అన్నాడు బావ.

"ఎల్లకాలం ఒకలాగుంటామా బావా" అంది జానకి చీరలు మడుచుకుంటూ.

"నిన్నరాత్రంతా నిన్నుగురించే ఆలోచించేను, "నీకెల్లాగైనా సుఖం కలిగించగలనా అని" అన్నాడు బావ.

"పోనీలెద్దూ అయిపోయిన విషయాలు తలచి ఏం లాభం? ఇంకేమైనా మాట్లాడు" అంది జానికి అమాయకంగా. ఇంతలో చిదానందం తిరిగి వచ్చేడు. తానూ జానకీ కలిసి తీయించుకున్న ఫొటో చూపెట్టేడు. ఫొటోలో మాత్రం జంట చాలాబాగుంది. ఆరోజంతా భానుమూర్తిని అంటిపెట్టుకునే వున్నాడు చిదానందం. అతన్ని చూస్తే కూడా భానుమూర్తికి జాలికలిగింది.

ఆరాత్రి భోజనం చేసి తిరుగు ప్రయాణానికి సిద్ధమయ్యేడు భానుమూర్తి, కారు వచ్చి వీధిలో నిలబడింది. చిదానందం అతని అన్నా క్రింద వున్నారు. భానుమూర్తి జానికితో చెప్పాలని పైకి వెళ్ళేడు. ఆమె ఒక్కతే బిక్కు బిక్కు మంటూ బాల్కనీలో నిలబడివుంది.

"నే వెళ్ళి వస్తా జానకీ" అన్నాడతడు.

"దయమాత్రం వుంచు" అంది మరదలు.

"ఎంతమాట! నా పంచప్రాణాలూ నీమీదేవున్నాయి" అన్నాడు బావ.

జానకి కళ్ళంట నీళ్ళు గిర్రున తిరిగి రెండు చేతులా మొహం మూసుకుంది. అది చూసి అతనికీ ఏడుపు వచ్చింది. అయినా నిగ్రహించుకుని "తప్పమ్మా! ఏడవకు నీకెప్పుడు కష్టం తోచినా నాకు రాయి. మీ అక్క వొకటి నేనొకటీ కాదు రెక్కలు కట్టుకు వాలుతాను." అంటూ క్రిందికి దిగివెళ్ళేడు. అన్నదమ్ములిద్దరితో చెప్పి వీధిగుమ్మం దిగుతూండగా అతని కోటుమీద రెండు నీటి బిందువులు పడ్డాయి. పైకి చూస్తే మూడో అంతస్థులోనుంచి ఎవరో క్రిందికి తొంగి చూస్తున్నారు. 'జానకి గాక మరెవరు' అనుకుంటూ కారులో కూర్చున్నాడు భానుమూర్తి.

రైలు కదిలింది. భానుమూర్తి తల కిటికీ వూచలికి ఆనించి కూర్చున్నాడు. బయటనుంచి చల్లగాలి తగిలి మత్తెక్కిస్తోంది. ఏవేవో బెంగలు, విచారాలూ అతని మెదడులో క్రిక్కిరిసిపోయాయి. జానకి భర్త మూగివాడని తన మామగాని, ఆఖరికి తన భార్యగాని ఎన్నడూ రాయలేదు. ఆమె ఎన్నిసార్లు రాసినా "జానకి అదృష్టవంతురాలు, వండెడు నగలు, పెట్టెడు బటలూ దానికేంలోటు" అంటూనే రాసింది. బహుశా ఏ బలహీనపు ఘడియల్లోనో తానే జానికైతే బాగుండుననిగూడా ఆమె యోచించి వుంటుంది. కాని తన విషయంలో మటుకు నిస్సందేహంగా చెప్పగలడు. వాళ్ళ భాగ్యానికి రెట్టింపు ధనమిచ్చినా తాను చిదానందాన్ని గావాలని ఎన్నడూ కోరడు. ఆయింట్లో కావలసినంత స్థలమూ, సామానూ, కారూ, నౌకర్లూ, వంటవాళ్ళూ వున్నమాట వాస్తవమే. కాని, జానకి ఏమాత్రం సుఖపడడం లేదన్నమాట కూడా వాస్తవం. అది తాను సులభంగా అర్థం చేసుకోగలడు. ఇక అతనికి అర్థంకానిదల్లా ఒకటే. అనుదినం మనోవ్యథతో కూరుకుపోయి ఎడారి కుసుమంగా హరించిపోతున్న జానకి జీవితాన్ని అనందమయమనిపిలిచే లోకం గ్రుడ్డిది గాక మూగిది కూడానా? ఏమీతోచక బయటికి తొంగి చూసేడు. భూమి తెలుపు నలుపుగా వెనక్కి పరుగెత్తుతోంది. భానుమూర్తి కొంచెం ఆలోచించి "ఈ భూమి నిజంగా వెనక్కి పరుగెత్తుతోందా నా భ్రమగాని" అనుకున్నాడు. ఇంతలో "జానకి సుఖపడుతోందని ప్రపంచం కూడా ఇల్లాగే భ్రమిస్తోంది కాబోలు" అని సమాధానం చెప్పుకున్నాడు.

★